క్లుప్తంగా

గిరిజన విద్యార్థులకు మెటీరియల్స్ వితరణ



ఇందుకూరుపేట : ఇందుకూరుపేటలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులకు సోమవారం వర్క్‌బుక్స్, మెటీరియల్స్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నేత పొట్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ యానాది వెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలపల రమేష్ అందించిన ఆర్థిక సాయంలో విద్యార్థులకు పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నేతలు ఆదిశేషయ్య, రమేష్ పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి కలిసి వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి సోమవారం వినతిపత్రాలు స్వీకరించారు. పొలాలకు సంబంధించిన వివాదాలపై, పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాలని అర్జీలను అందజేశారు. వినతులను పరిశీలించిన తహసీల్దార్ త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బీఎల్వో విధుల నుంచి తప్పించాలి

పొదలకూరు : అంగన్‌వాడీ టీచర్లను బూత్ లెవల్ అధికారి విధుల నుంచి తప్పించాలని అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 తర్వాత అంగన్‌వాడీ టీచర్లకు ఎన్నికల విధులు అప్పగించకూడదనే ఉత్తర్వులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనానికి మోక్షం



వేగంగా జరుగుతున్న పనులు

పొదలకూరు : దీర్ఘకాలికంగా అసంపూర్తిగా ఉన్న మండల మహిళా సమాఖ్య భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని అసంపూర్తి భవనానికి నిధులు మంజూరు చేయించడంతో పనులు పునఃప్రారంభమయ్యాయి. రెండురోజులుగా భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నుడా నుంచి రూ.17 లక్షల నిధులు మంజూరైంది. పట్టణ నడిబొడ్డున ఎంతో కాలంగా మొండిగోడలతో దర్శనం ఇస్తున్న భవనం ప్రస్తుతం తిరిగి చేపడుతుండడంతో స్థానిక ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది.

రామ్మోహన్‌కు డాక్టరేట్

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్స్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న చిన్నెమ్ రామ్మోహన్‌కు డాక్టరేట్ లభించింది. అసోసియేట్ ప్రొఫెసర్లు ఎస్ కిరణ్, వాసుదేవ పర్యవేక్షణలో 'హైబ్రిడ్ వావ్‌లెట్ అప్రోచ్ ఫర్ మల్టీఫోకస్ ఇమేజ్ ఫ్యూజన్ బేస్డ్ ఆన్ టెక్చర్ అండ్ పీసీఏ ఫర్ ఇమేజ్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్' అనే అంశంపై పరిశోధనలు సాగించడంతో కర్ణాటక రాష్ట్రం బెల్గావిలోని వీటీయూ వర్సిటీలో డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌ను నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి రాజేంద్ర, ఇతర విభాగాధిపతులు సోమవారం సత్కరించి అభినందించారు.

27న సుస్వరాభిషేకం

నెల్లూరు(బృందావనం): సినీ ఆర్కెస్ట్రా మ్యూజిషియన్స్ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఈ నెల 27న పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం ప్రాంగణంలో సుస్వరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుస్వర రాజశేఖర్, ఇమ్మారెడ్డి పెంచలరెడ్డి తెలిపారు. సోమవారం వారు నగరంలోని రేబాలవారి వీధిలోని సుస్వర మ్యూజికల్ వరల్డ్‌లో సుస్వరాభిషేకం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. జూలైలో జన్మించిన ప్రముఖ సినీ సంగీతదర్శకులు, గాయకులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఏఎం రాజా జయంతి, కీరవాణి, మణిశర్మ, ఉన్నికృష్ణన్, చిత్ర, దామిని, అనురాధ శ్రీరామ్, మాళవిక, సమీరాభరద్వాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వారు స్వరపరచిన, ఆలపించిన పాటలతో సుస్వరాభిషేకం చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా నిరుపేద ఆర్కెస్ట్రా కళాకారులకు ఆర్థిక సాయం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి సంగీతాభిమానులు,కళాకారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు బుల్లితెర నటుడు ఎస్ మురళీమోహన్‌రావు, శ్రీవాస విఆర్కెస్ట్రా, ఈవెంట్స్ అధినేత్రి ప్రశాంతి పాల్గొన్నారు.

వర్షాకాలం.. జర భద్రం

- డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలపై వైద్యారోగ్యశాఖ అప్రమత్తం
- పలు ప్రాంతాల్లో వైద్యశిబిరాలు, అవగాహన సదస్సులు



అంటు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది (ఫైల్)

కోవూరు : వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. సీజనల్ వ్యాధులైన డెంగీ, వైరల్ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్ వంటివి ఈ కాలంలో అధికంగా వస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. అవసరమైన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులను ఉచితంగా అందజేస్తోంది. రోగ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అవసరమైన వైద్యసహాయం అందించేందుకు 50వ విడత ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్యారోగ్యశాఖ ఆదేశించింది. ఈ సర్వేను నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సచివాలయ పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు సర్వేను ప్రారంభించింది. ఈ సర్వేలో ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నారు. ఈ సర్వే నెలాఖరు వరకు జరుగనుంది. జ్వరలక్షణాలు ఉన్న వారి రక్తం సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపుతారు. ఇలా ఎవరికైనా జ్వరాలు నిర్ధారణ అయితే వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే వైద్యారోగ్య సిబ్బంది నిత్యం బృందాలుగా ఏర్పడి ప్రజల ఆరోగ్య అంశాలపై ఆరా తీస్తున్నారు. అవసరమైన చోట అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నాం. ప్రస్తుతం 50వ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. అధిక సంఖ్యలో జ్వరం బారిన పడిన వారిని గుర్తిస్తే వెంటనే అక్కడ ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ఇర్ఫాన్, ఇనమడుగు పీహెచ్‌సీ

ప్రజలకు అవగాహన

వర్షాకాలంలో వీధులు, మురుగు కాలువల్లో నీరు నిల్వ చేరితే దోమలు ఇట్టే వ్యాప్తి చెందుతాయి. దీనిని నివారించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. అలాగే ప్రజలకు సైతం అవగాహన కలిగిస్తున్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు, దోమల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సర్వే చేసిన సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు. వైద్యారోగ్యశాఖ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తోంది.

ఆ రోజు ఆశా వర్కర్లు, వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జ్వరాలపై అవగాహన కలిగిస్తున్నారు.



కాలువను పరిశీలిస్తున్న సిబ్బంది

విద్యుత్ సరఫరాలో ఆటంకం రాకూడదు



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు

- రాష్ట్ర రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ నాగార్జునరెడ్డి

మనుబోలు : విద్యుత్ సరఫరాలో ఆటంకం రాకుండా నిర్వహణ చేయాలని ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి అన్నారు. మనుబోలు సబ్‌స్టేషన్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా నాణ్యతను, ఫీడర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులు ఇబ్బంది పడకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కాగా ఈఈ ఇస్మాయిల్ మాట్లాడుతూ మనుబోలులో 132 కేవీ సబ్‌స్టేషన్ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, గూడూరు, నెల్లూరు నుంచి విద్యుత్ సరఫరా చేయడం వల్ల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ట్రాన్స్‌కో మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు దృష్టికి తెచ్చారు. మనుబోలు పరిధిలో ఐదెకరాల ప్రభుత్వ స్థలం కేటాయిస్తే సబ్‌స్టేషన్ మంజూరు చేస్తామని సమాధానమిచ్చారు. దీంతో మనుబోలు పరిసరాల్లో మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెగ్యులేటరీ కమిషన్ మెంబర్లు రామ్‌సింగ్, వెంకటరామిరెడ్డి, ఈఈ సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు, విజిలెన్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సాంబశివరావు, ఏడీ శ్రీనివాసరావు, ఏఈ రవికుమార్‌రెడ్డి, జె.నాగార్జున, జేఎల్ఎంలు బాలు, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు పరిమితిని పెంచుకోవాలి

- డీపీఎం కామాక్షి



మాట్లాడుతున్న డీపీఎం కామాక్షి

కొడవలూరు: మహిళలు పొదుపు పరిమితిని విధిగా పెంచుకోవాలని డీఆర్‌డీఏ డీపీఎం కామాక్షి సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆర్థిక కార్యకలాపాల నిర్వహణపై సంఘ బంధం వీఓఏలు, సంఘ మిత్ర కార్యవర్గ సభ్యులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు పరిమితి పెంచుకోవడం ద్వారా రుణ పరపతి పెంచుకోవాలని చెప్పారు. ఇప్పటివరకు నెలసరి రూ.200 లు పొదుపు చేసే వారు ఇక మీదట నెలకు రూ.400 లు చెల్లించేలా పొదుపు పెంచాలన్నారు. ఒక్కో సభ్యురాలికి కేవలం రూ.50 వేల రుణ పరిమితి ఉండగా, దానిని రూ.1.50 లక్షలకు పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం వల్ల వడ్డీ తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రుక్మిణి, సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరమ్మ, సుశీలమ్మ, సీసీలు సునీల్, ఉదయ్, మమత, శోభ, శ్రీదేవి, సుకన్య, వీఓఏలు పాల్గొన్నారు.

రూ.1.65 కోట్లతో సెంటర్ లైటింగ్



లైటింగ్ పనులను ప్రారంభిస్తున్న చలపతిరావు

- నెల రోజుల్లో పూర్తి చేయిస్తాం
- డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు

కొడవలూరు: నార్తురాజుపాళెంలో రూ.1.65 కోట్లతో చేపడుతున్న సెంటర్ లైటింగ్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయిస్తామని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు స్పష్టం చేశారు. సీఎం ప్రత్యేక నిధులతో నార్తురాజుపాళెం ప్రధాన రహదారిలో చేపడుతున్న లైటింగ్ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.కోటి నుడా నిధులతో సైడ్ డ్రెయిన్ పనులు పూర్తి చేశామన్నారు. సెంటర్ లైటింగ్‌తో పాటు ఇరువైపులా రోడ్లు, సెంటర్‌లో ప్లాంటేషన్ కూడా వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య రాకుండా వాహన రాకపోకలను బుచ్చి రోడ్డు మీదుగా మళ్లించినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నార్తురాజుపాళెం అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవ వల్ల రూ.కోట్ల నిధులు మంజూరవుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎం.రంగారెడ్డి, సల్లావుల శ్రీనివాసులు, సొసైటీ అధ్యక్షుడు డి.శివకుమార్, డీఎల్‌డీఏ డైరెక్టర్ ఎం.మల్లికార్జున, నాయకులు అడపాల మోహనకృష్ణ, కొండా శ్రీనివాసులురెడ్డి, ఎండి కరిముల్లా, చక్కా మనోహర్, ఎస్.మాణిక్యరావు, జి.జనార్దన్‌రెడ్డి, సీహెచ్.శేషగిరి, జి.మస్తానయ్య పాల్గొన్నారు.

పచ్చిబియ్యం ఎగుమతిని కొనసాగించాలి



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు : కేంద్ర ప్రభుత్వం పచ్చిబియ్యం ఎగుమతిని కొనసాగించాలని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి కోరారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా వరిసాగు పైనే రైతులు ఆధారపడి ఉంటారన్నారు. పచ్చిబియ్యం ఎగుమతిని నిలుపుదల చేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కాకాణిని కోరినట్లు చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి ఎంపీటీసీ సభ్యుడు వేణు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

మనుబోలు : మండలంలోని కట్టువపల్లి, గురివిందపూడి గ్రామాల్లో మంగళవారం(నేడు) జరుగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ గురివిందపూడి, కట్టువపల్లి గ్రామాల్లో వారం ముందు నుంచే సర్వే నిర్వహించామని, ఎవరెవరికి ఏఏ సర్టిఫికెట్లు అవసరమో గుర్తించామని తెలిపారు. సురక్ష శిబిరంలో దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆయన వెంట కార్యాలయ ఏఓ రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద సోమవారం జరిగింది. బుజబుజనెల్లూరుకు చెందిన మణికంఠ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి వెళ్లే క్రమంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మణికంఠకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

పొదలకూరు : మండల పరిధిలోని మరుపూరు, విరువూరు సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలను మంగళవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి సోమవారం తెలిపారు. ఈ శిబిరాల్లో వెరిఫికేషన్లో గుర్తించి వారికి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తామన్నారు.

రేపు జాబ్‌మేళా

కోవూరు : మండల కేంద్రంలోని ఎర్రబాట కృష్ణారెడ్డి, కౌసల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ సుమారు 14 కంపెనీల్లో 1,227 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

మనుబోలు : ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మనుబోలు గ్రామానికి చెందిన బొర్రా మోహన్ కోరారు. ఈ మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం నెల్లూరులో కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ తాను మనుబోలు మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉంటున్నానని, తాను కొనుగోలు చేసిన స్థలానికి తూర్పు వైపున ఆర్అండ్‌బీ రోడ్డు హద్దుగా ఉండగా, రోడ్డుకు ఇంటికి మధ్య ఖాళీ స్థలాన్ని కొందరు ఆక్రమించి రోడ్డు వైపు రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

జడివానతో బేజారు



పొదలకూరు : గత నాలుగు రోజులుగా అల్పపీడన ప్రభావం వల్ల కురుస్తున్న జడివానలతో జనాలు బేజారెత్తుతున్నారు. జూలై చివరిలో పడునయ్యే వర్షం కురిస్తే మెట్టపంట దుక్కిదున్నకం పనులు చేసుకునేందుకు రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అయితే బురద వర్షం కురుస్తుండడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదంటున్నారు. జడివానలతో గ్రామీణ ప్రాంతాల్లో మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. నిమ్మరైతులు మార్కెట్‌కు కాయలను తీసుకొచ్చేందుకు సమస్యలు ఎదుర్కొంటున్నారు. తోటల్లో కాయలు రాలిపోతున్నా యార్డుకు పంపలేని పరిస్థితి ఏర్పడిందంటున్నారు.

సోమిరెడ్డివి నీచ రాజకీయాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

పొదలకూరు: 'మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సర్వేపల్లి ప్రజలు రెండుసార్లు ఆశీర్వదించారు. ఆయన గురించి ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఉపేక్షించం' అని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదలకు జానెడు భూమిని పంపిణీ చేస్తుంటే సోమిరెడ్డి బురద రాజకీయాలు చేస్తున్నాడన్నారు. పేదలకు భూహక్కు కల్పించేందుకు మంత్రి కాకాణి కృషి చేస్తుంటే.. ఉనికి కోల్పోతాడనే భయంతో సోమిరెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. పేదలకు భూముల పంపిణీ చేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. 40 ఏళ్ల సోమిరెడ్డి రాజకీయ అనుభవం పరిశీలిస్తే ప్రజాస్వామ్య వాదులు సిగ్గుపడతారన్నారు. దొడ్డిదారిన మంత్రి అయ్యి నకిలీ ఎరువుల కుంభకోణం, రైస్‌మిల్లర్ల వద్ద డబ్బులు దండుకోవడం, షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులకు కమీషన్లు, రైతు రథాల పేరుతో ట్రాక్టర్ యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు దుయ్యబట్టారు. పొదలకూరులో బాడుగలు కట్టలేక టీడీపీ కార్యాలయం ఖాళీ చేస్తే మంత్రికేమి సంబంధమని ప్రశ్నించారు. సర్వేపల్లి అభివృద్ధిపై బహిరంగ చర్చకు రమ్మంటే ఒక్కసారైనా వచ్చారా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం చినబ్రహ్మయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ ఎం.శేఖర్‌బాబు, బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ, నేతలు సోమా భాస్కర్‌రావు, ఎస్‌కే అంజాద్, జి.వేణురెడ్డి, ఎం.శివప్రసాద్, డి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయోత్సవ సభను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: మండలంలోని కమ్మపాళెంలో ఈనెల 28న జరుగనున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' విజయోత్సవ సభను జయప్రదం చేద్దామని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పిలుపునిచ్చారు. నార్తురాజుపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28వ తేదీతో కొడవలూరు మండలంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. మండలంలోని 16 సచివాలయాల సిబ్బంది, నాయకులు, వలంటీర్లు, అధికారులు కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగిరెడ్డి సునీల్‌కుమార్, వల్లాపురం నవీన్, ఎంపీటీసీ పెనాక శ్రీనివాసులురెడ్డి, నాయకులు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, దేవిరెడ్డి సాయిరెడ్డి, అక్కుల్‌రెడ్డి, కళాకృష్ణ, ప్రసన్నకుమార్, తిరుపతి పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



వ్యవసాయశాఖ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏడీఏ

ఇందుకూరుపేట: పంట వివరాలతో పాటు రైతు వివరాలను కూడా తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని ఇందుకూరుపేట సబ్ డివిజన్ ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. ఇందుకూరుపేటలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ సిబ్బందికి సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్‌లో పంటతో పాటు రైతు వివరాలు నమోదైతేనే ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు అవసరమైతే ఆర్బీకేలను సంప్రదించే విధంగా రైతులకు తెలియజేయాలని కోరారు. అలాగే తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సూచిక బోర్డులు సిద్ధం



పొదలకూరు : పట్టణ పరిధి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో పంచాయతీ పాలకమండలి ప్రతివీధిని గుర్తించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయిస్తున్నారు. సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి పంచాయతీలో తీర్మానం చేసి ప్రతి వీధిలో ఒక సూచిక బోర్డును నిర్మించడం వల్ల పట్టణానికి వచ్చే కొత్తవారు సులభంగా గుర్తించేందుకు వీలు కలిగేలా బోర్డులను తయారు చేయించారు.